సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



ముహూర్తం కుదిరింది..


వివాహాల సీజన్ మళ్లీ మొదలైంది. ఆశ్వయుజ, కార్తిక, మార్గశిర మాసాల్లో (అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు) మంచి లగ్నాలు ఉండటంతో వివాహాది శుభకార్యాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



పల్లె పండుగ.. ఉత్తి దండగ

పల్లె పండుగ అన్నారు.. ఎనలేని అభివృద్ధికి ఇదే శ్రీకారం అని చెప్పారు.. తీరా తొలి రోజే చేతులెత్తేశారు. ఎంతో చేస్తారని చూసిన ప్రజానీకానికి మొండిచేయి చూపారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 80,215 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 10 వేల క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

వర్షాలతో తడిసిన విద్యుత్ స్తంభాలను తాకవద్దు

అమలాపురం టౌన్: వర్షాలతో తెగిపడిన విద్యుత్ వైర్లు, తడిసిన స్తంభాలు, వైర్లు తెగిపడిన చెట్టు కొమ్మలను ప్రజలు నేరుగా తాకవద్దని విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ ఎస్.రాజబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సూచించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. దీనికోసం అమలాపురం, రామచంద్రపురంలలో 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమలాపురం డివిజన్‌కు సంబంధించి 94409 04477, రామచంద్రపురం డివిజన్‌కు సంబంధించి కంట్రోల్ రూమ్ ఫోన్ నంబరు 94931 78821ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు. వర్షాల కారణంగా ఎక్కడైనా విద్యుత్ అంతరాయం లేదా సమస్య తలెత్తితే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పరిశీలిస్తే, ఉప్పలగుప్తం మండలంలో అధికంగా 60.8 మిల్లీమీటర్లు, రావులపాలెం, కపిలేశ్వరపురం మండలాల్లో 1.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురం, మండపేట, రాయవరం, రామచంద్రపురం, ఆలమూరు మండలాల్లో అసలు వర్షపాతమే నమోదు కాలేదు. మిగిలిన మండలాల్లో ఇలా.. కొత్తపేటలో 2.4, కె.గంగవరంలో 4.8, ఐ.పోలవరంలో 17.4, ముమ్మిడివరంలో 19.8, అయినవిల్లిలో 29.6, పి.గన్నవరంలో 12.2, అంబాజీపేటలో 19.4, మామిడికుదురులో 23.8, రాజోలులో 22.4, మలికిపురంలో 21.6, సఖినేటిపల్లిలో 19.8, అల్లవరంలో 15.2, అమలాపురంలో 43.0, కాట్రేనికోనలో 22.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

పోలీస్ గ్రీవెన్స్‌కు 14 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదులు అందించారు. వచ్చిన అర్జీల్లో కొన్ని కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలకు సంబంధినవి ఉండడంతో వాటి పరిష్కారానికి ఆయా పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్సైలతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి తగిన ఆదేశాలు ఇచ్చారు. నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మిగిలిన సమస్యలను ఎస్పీ అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

సంక్షేమంపై శ్రద్ధ ఏదీ?

అమలాపురం టౌన్: నూతన మద్యం పాలసీపై ఉన్న శ్రద్ధ సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల అమలుపై కూటమి ప్రభుత్వానికి లేదని వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా అన్నారు. అసలు ప్రభుత్వం ఎంత సేపూ అడ్డదారుల్లో ఆదాయాన్ని రాబట్టే ప్రయత్నాల్లో తప్ప సంక్షేమం గురించి ఆలోచనే లేనట్టు వ్యవహరిస్తోందన్నారు. ఈ మేరకు గౌతమ్ రాజా అమలాపురంలో సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నూతన మద్యం పాలసీ ద్వారా సామాన్యులకు ఏ ఒక్క వైన్ షాపు రాకుండా ఉండేందుకు అధిక రుసుములు వసూలు చేసి, అది కూడా నిర్ణీత సమయాన్ని దాటి గడువు పెంచి ప్రభుత్వం ఆదాయాన్ని దండుకుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇందుకేనా గద్దెనెక్కిందని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు ఇప్పుడు అత్యవసరంగా కావాల్సింది మద్యం కాదని, సంక్షేమ పథకాలని గౌతమ్ రాజా గుర్తు చేశారు.

డీఎస్సీలో ఉచిత శిక్షణ

కాకినాడ సిటీ: జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం ఇక్కడ తెలిపారు. పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు డీఎస్సీలో ఉత్తమ ఫలితాలు పొందేందుకు ప్రభుత్వం ఉచితంగా శిక్షణను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రెసిడెన్షియల్ ప్రాతిపదికన శిక్షణ ఉంటుందన్నారు. టెట్‌లో ఉత్తీర్ణులైన వారికి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి, అందులో 85 శాతం, టెట్‌లో పొందిన మార్కుల్లో 15 శాతం వెయిటేజ్ ఇచ్చి, కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షలలోపు ఉన్న వారిని ఎంపిక చేస్తారని వివరించారు. ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 21లోగా దరఖాస్తులు అందాలన్నారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు ఈ నెల 27న ఉంటుందని తెలిపారు.

సిండికేట్‌కు రిజర్వ్ ఆప్షన్

- మద్యం దుకాణం దక్కిన వారితో పాటు రిజర్వ్‌గా ఇద్దరి ఎంపిక
- ముందున్న వ్యక్తిని తప్పించేందుకు యత్నాలు
- రాజకీయ ఒత్తిడికి టీడీపీ నేతల సిద్ధం



మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

సాక్షి, అమలాపురం: వడ్డించేవాడు మనోడైతే చివరి పంక్తిలో ఉన్నా ఫర్వాలేదనట్టు టీడీపీ అనుకూల మద్యం సిండికేట్‌దారులకు ప్రభుత్వం 'రిజర్వ్' ఆప్షన్ ఇచ్చింది. లాటరీ విధానంలో దుకాణాలు దక్కని టీడీపీ మద్యం మాఫియాకు సువర్ణావకాశం తీసుకొచ్చింది. దుకాణాలు పొందిన వారిని తమ సిండికేట్‌లోకి తీసుకోవడం ఒకటైతే, లేదా వారిని తప్పించి రిజర్వ్ ఒకటి, రిజర్వ్ రెండు స్థానాల్లో ఉన్న తమకు అనుకూలమైన వ్యక్తులకు దుకాణాలు దక్కేలా అవకాశం కల్పించింది. ఇలా పావులు కదుపుతున్నారు.

జిల్లాలో 133 మద్యం దుకాణాలకు సంబంధించి ప్రభుత్వం సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో లాటరీ నిర్వహించింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన ప్రక్రియ మధ్యాహ్నం 1.30 గంటలకు ముగిసింది. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేవీడీ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. మొత్తం దుకాణాలకు 4,087 దరఖాస్తులు అందాయి. లాటరీ నిర్వహించే ప్రాంతాల్లో కూటమి నేతల హడావుడి అధికంగా కనిపించింది. దరఖాస్తులు చేయని వారు సైతం ముస్తాబై వచ్చేశారు. వీరి తాకిడి వల్ల అమలాపురం నల్ల వంతెన నుంచి బాలయోగి స్టేడియం వరకూ పలు సందర్భాల్లో ట్రాఫిక్ స్తంభించింది. కొండంత ఆశతో కలెక్టరేట్‌కు నవ్వుతూ వచ్చి లాటరీలో అదృష్టం దక్కని వారు దిగాలుగా వెళుతూ కనిపించారు.

కౌంటర్లు ఏర్పాటు చేసి..

గోదావరి భవన్‌లో లాటరీ నిర్వహించే చోట రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒకటో కౌంటర్‌లో అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ల పరిధి, రెండో కౌంటర్‌లో రాజోలు, ఆలమూరు, రామచంద్రపురం స్టేషన్ల పరిధిలో దుకాణాలకు లాటరీ తీశారు. ఆయా స్టేషన్ల పరిధిలో అర్బన్, మండలాల్లో కేటాయించిన దుకాణాల నంబర్ల ఆధారంగా లాటరీ ప్రక్రియ జరిగింది.

వారికి చావుదెబ్బే

ఈ మద్యం లాటరీలో పాత సిండికేట్‌దారులకు మాత్రం చావు దెబ్బతగిలింది. అమలాపురం, అంబాజీపేట, ఉప్పలగుప్తం మండలాలకు చెందిన పాత మద్యం వ్యాపారులు ఉప్పలగుప్తానికి చెందిన ఒక లిక్కర్ కింగ్ ఆధ్వర్యంలో దరఖాస్తులు వేశారు. ఏకంగా 156 దుకాణాలకు డీడీలు తీయగా, కేవలం రెండు దుకాణాలు మాత్రమే తగిలాయి. డీడీలు తీసిన సొమ్ముతో పోలిస్తే ఒక్కో దుకాణం ఖరీదు ప్రస్తుతానికి రూ.1.56 కోట్లు లెక్క.

- ఇదే ప్రాంతంలో తొమ్మిది మంది యువకులు 56 దుకాణాలకు డీడీలు తీయగా, ఒక్క దుకాణం కూడా రాకపోవడం గమనార్హం.
- రాజోలుకు చెందిన కీలక జనసేన నేత, అతని ఆప్తమిత్రుడు రెండు దశాబ్దాల కాలంగా మద్యం వ్యాపారంలో ఉన్నారు. వీరిద్దరూ కలసి ఏర్పాటు చేసిన సిండికేట్‌లో సభ్యులు రాజోలు దీవిలో 29 దుకాణాలకు సుమారు 320 డీడీలు తీయగా కేవలం ఎనిమిది షాపులు మాత్రమే వారికి దక్కాయి. ఇలా ఒక్కో దుకాణం ఖరీదు రూ.22.60 లక్షల వరకూ అయ్యింది.
- కొత్తపేట నియోజకవర్గంలో సైతం ఇదే పరిస్థితి ఎదురైంది. స్థానికంగా ఒక కీలక నేత సమీప బంధువుల ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కీలక నాయకులంతా కలిసి ఏకంగా 420 డీడీలు వేశారు. కేవలం 13 షాపులు మాత్రమే దక్కాయి. దీంతో వారు లబోదిబోమంటున్నారు. ఒక్కో షాపును రూ. 64.61 లక్షలకు దక్కించుకున్నట్టయ్యింది.

ప్రశాంతంగా ముగిసిన ప్రక్రియ: కలెక్టర్

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీ డ్రా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. నూతన మద్యం పాలసీలో భాగంగా ఈ లక్కీ డ్రా ప్రక్రియ నిర్వహించామన్నారు. దరఖాస్తుదారుల సమక్షంలో అత్యంత పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేశామన్నారు. మొత్తం ప్రక్రియను చిత్రీకరించినట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు పాల్గొన్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

మద్యం షాపుల లాటరీ ప్రక్రియలో మహిళలూ పాల్గొనడం విశేషం. లాటరీ తీస్తున్న సమయంలో షాపులు దక్కాలని వారు దేవుళ్లకు దండం పెడుతూ కనిపించడాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు. అమలాపురం రూరల్ మండలంలో 7వ నంబర్ షాపును ఓ మహిళ దక్కించుకోవడం విశేషం. ఇదిలా ఉంటే మద్యం దుకాణాల వారీగా లాటరీ తీస్తున్నట్టు ప్రకటిస్తున్న సమయంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. కొంతమంది తమకు దుకాణాలు దక్కాలని దేవుడిని తలుచుకుంటూ కనిపించారు. ఎన్నికల ఫలితాల కోసం కౌంటింగ్ కేంద్రాల బయట ఎదురు చూసే కార్యకర్తల్లా లాటరీ ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురు చూశారు.



లాటరీలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలు

కలెక్టరేట్ ఆవరణలోనే మంతనాలు

లాటరీ ప్రక్రియలో రిజర్వ్ తీయడం, వారిలో తమ వర్గానికి చెందిన వారు అధికంగా ఉండడంతో దుకాణాలు దొరకని మద్యం వ్యాపారులు అప్రమత్తం అయ్యారు. దుకాణాలు పొందిన వారిని సిండికేట్‌లోకి తీసుకురావడం తొలి ప్రాధాన్యంగా, లేకుంటే వారిని సామాబేధ దండోపాయాలతో తప్పించి రెండు, మూడు స్థానాల్లో ఉన్న తమ వారికి దుకాణాలు వచ్చేలా చేయాలని ముమ్మర ప్రయత్నాలు చేపట్టారు. మద్యం దుకాణాలకు లాటరీ తీసిన ప్రాంతాల్లోనే షాపులు దక్కించుకున్న యజమానుల జాబితాతో టీడీపీ అనుకూల సిండికేట్‌దారులు అప్పటికప్పుడు మంతనాలు ప్రారంభించడం గమనార్హం. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం వ్యాపారం తమ కనుసన్నల్లోనే జరగాలనే పట్టుదలతో ఉన్నవారు కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారితో కలెక్టరేట్ బయట మంతనాలు చేయడం విశేషం.

చివరి ఆశలు ఇవే..

మద్యం దుకాణాల కేటాయింపుల లాటరీలో మొదటి టోకెన్ వచ్చిన వారికి దుకాణం కేటాయిస్తూనే, రిజర్వ్ దుకాణదారుని కోసం మరో రెండు టోకెన్లు తీశారు. రిజర్వ్–1, 2 అంటూ పేర్లు నమోదు చేశారు. మొదటి వ్యక్తి ప్రభుత్వం నిర్ణయించిన ఎక్సైజ్ ట్యాక్స్‌లో తొలి వాయిదా కట్టకపోతే రిజర్వ్–2 వ్యక్తికి, అతను కూడా చెల్లించకుంటే రిజర్వ్–3 వ్యక్తికి అవకాశం కల్పిస్తామని అధికారులు చెప్పారు. ఇది టీడీపీ అనుకూల మద్యం సిండికేటుదారులకు మేలు చేసేందుకే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాలు దక్కించుకున్న వారిలో మూడొంతుల మంది టీడీపీ, జనసేన అనుకూల వ్యక్తులు కావడం గమనార్హం. రాజోలు దీవి, కొత్తపేట నియోజకవర్గం, అమలాపురం, ఉప్పలగుప్తం, అంబాజీపేటల ఉమ్మడి సిండికేట్‌కు లాటరీల్లో చావు దెబ్బతగిలింది.



దుకాణాలు దక్కించుకున్న వారి జాబితాతో సిండికేట్‌దారుల కసరత్తు



లాటరీ ప్రక్రియను ఉత్కంఠ భరితంగా చూస్తున్న ఆశావహులు

రత్నగిరికి భక్తుల తాకిడి



సత్యదేవుని ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానం ఆదాయం రూ.40 లక్షలు
- ముత్యాల కవచాల అలంకారంలో స్వామి, అమ్మవారు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సోమవారం వేలాదిగా వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. సత్యదేవుని సన్నిధిలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. నవ దంపతులతో పాటు, ఇతర ప్రాంతాల్లో పెళ్లిళ్లు చేసుకున్నవారు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. వీరంతా సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఇతర భక్తులు కూడా తోడయ్యారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, విశ్రాంతి మంటపాలు కిక్కిరిశాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా, స్వామివారి వ్రతాలు మూడు వేలు జరిగాయి. వివిధ విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భోజనాలు చేశారు. సోమవారం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారు, శంకరులను ముత్యాల కవచాలు(ముత్తంగి సేవ)తో అలంకరించి పూజించారు. స్వామివారు,, అమ్మవార్లను దర్శించిన భక్తులు పులకించారు.

పరీక్షల నిర్వహణలో మార్పులు చేయాలి

అమలాపురం టౌన్: పాఠశాల విద్యా క్యాలెండర్ ప్రకారం జూన్– సెప్టెంబర్ నెలలకు సంబంధించి 85 రోజుల పనిదినాల్లో వరదలు, వర్షాలు, తుపాన్‌లతో 10 నుంచి 15 రోజులు ఉపాధ్యాయులు నష్టపోయారని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ప్రభుత్వానికి గుర్తు చేశారు. ఈ కారణాలతో పాఠశాల విద్యా పరీక్షల నిర్వహణలో కొన్ని మార్పులు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రకృతి వైపరీత్యాలతో కొన్ని రోజులు నష్టపోతే, మరో వైపు కాంప్లెక్స్ సమావేశాలు, శిక్షణ తరగతులు, యాప్‌ల మేనేజిమెంట్‌ల పేరుతో అకడమిక్ పనిగంటలు కూడా ఎన్నో నష్టపోయార ని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యార్థులకు నష్టం అనివార్యమైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సబ్జెక్ట్ పుస్తకాలు జూలైలో సరఫరా చేశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరాన్ని ఆయ న సూచించారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ –2 పరీక్షలకు ఆగస్టు నెల సిలబస్ తీసుకోవాలన్నారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ –2 పరీక్షలు రోజుకు రెండు చొప్పున నిర్వహించాలన్నారు. సీబీఏ పరీక్ష పేపరు పేరు మార్చి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్‌ను యూనిట్ టెస్ట్ మాదిరిగా డీసీఈబీ ద్వారా నిర్వహించాలని ఎమ్మెల్సీ ఐవీ డిమాండ్ చేశారు. తాను సూచించిన విషయాలను పరిశీలించాలన్నారు.

ఓఎన్‌జీసీ వాహనాల అడ్డగింపు



ఉప్పలగుప్తంలో ఓఎన్‌జీసీ వాహనాలను అడ్డుకుని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని స్థానిక గ్రామంలో ఉన్న పేరాయిచెరువు వైపునకు వెళ్లే ప్రధాన కూడలిలో ఓఎన్‌జీసీకు సంబంధించిన వాహనాలను గ్రామస్తులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. సరిపల్లి–మునిపల్లి ప్రధాన రహదారి నుంచి పేరాయిచెరువు వెళ్లే రహదారి అధ్వానంగా మారిందని, దాన్ని వెంటనే ఆధునీకరిస్తే గాని ఓఎన్‌జీసీ కార్యకలాపాలు చేయడానికి వీలు లేదని సుమారు 4 గంటల పాటు ధర్నా చేపట్టారు. తహసీల్దార్ వీఎస్ దివాకర్, ఎస్ఐ సీహెచ్ రాజేష్, ఓఎన్‌జీసీ అధికారులతో చర్చలు జరిపాక రోడ్డు నిర్మాణానికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిక్కం బాలసుబ్రహ్మణ్యం, రవణం మధు, చిక్కం కాసు, పెయ్యిల దుర్గారావు, చిక్కం భీముడు, నాగులపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

చినుకు చినుకు.. గాలివానై

- ఎక్కడా తగ్గని వర్షాలు
- వాతావరణ శాఖ హెచ్చరికలతో మరింత ఆందోళన
- వరి పంటపై అన్నదాత కలవరపాటు
- భారీ వర్షాలతో స్తంభించిన జనజీవనం

ఆలమూరు: వానలు ఎక్కడా ఆగడం లేదు.. అన్నదాతకు కంటి మీద కునుకు ఉంచడం లేదు.. వీధుల నుంచి ముంపునీరు పోవడం లేదు.. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో మూడు రోజుల పాటు పిడుగులు, ఉరుములతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటికే వారం రోజుల వ్యవధిలో చెదురుమదురు వర్షాలు కురవగా, అల్పపీడనం ప్రభావంతో సోమవారం భారీ వర్షం పడింది. జనజీవనం ఎక్కడికక్కడే స్తంభించింది. ప్రధాన రహదారులన్నీ నీటితో నిండుతున్నాయి. వ్యవసాయ, భవన నిర్మాణ, ఇటుక బట్టీ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. ఈ వర్షాలతో వరి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అన్నదాతలు కలవరపడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే దెబ్బతిన్న వందలాది కిలోమీటర్ల రహదారులు మరింత దారుణంగా మారుతాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వర్షపు నీరు రోడ్లపైనే నిల్వ ఉండటంతో ఆ ప్రాంతాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో మరికొన్ని రోజులు వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ చెబుతుండడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు.

అన్ని రంగాలపై ప్రభావం

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 1.58 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టగా, అందులో 90 శాతం మేర ఈనిక దశ, కంకి గట్టిపడే దశల్లో ఉన్నాయి. ఈదురు గాలులు, వర్షాలతో కంకి దశలో ఉన్న వరిచేలు వాలిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు వర్షాలతో వరి గింజ గట్టి పడకుండా పొల్లుగా మారే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 1,200 ఇటుక బట్టీలు మూతబడ్డాయి. అందులో పనిచేస్తున్న దాదాపు 15 వేల మంది వలస కార్మికులతో పాటు స్థానిక కార్మికులు ఉపాధి కోల్పోయారు. మరో పది రోజుల వరకూ పనులు చేపట్టే అవకాశం లేక వారి జీవనోపాధికి గండి పడింది. అలాగే వివిధ వ్యాపారులూ ఇబ్బంది పడుతున్నారు.

రహదారుణాలు

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న రహదారులు అధ్వానంగా మారాయి. ఈ వర్షాలకు మరింత దారుణంగా తయారవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అసలు రోడ్లను పట్టించుకోక చిన్నపాటి వర్షాలకే చెరువుల్లా మారిపోతున్నాయి. ఆ గోతుల్లోకి చేరిన నీటి కారణంగా వాహనదారులు ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇప్పటి వరకూ ఒక తట్ట మట్టితో గోతులను పూడ్చకపోవడం గమనార్హం. ఈ దారుల్లో ఎలా ప్రయాణించాలో అంటూ వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.



ఆలమూరులో మూతపడిన ఇటుక బట్టీ



కేశవరం నుంచి బొమ్మూరు వెళ్లే రోడ్డులో గోతుల్లో నిలిచిన నీరు



మోదుకూరులో భారీ వర్షాలకు పడిపోయిన వరి చేలు

కనీసం పట్టించుకోక..

జిల్లాలో వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. దీనిపై కనీస చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సోమవారం అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్‌లో మద్యం దుకాణాల ఎంపికకు లాటరీ తీశారు. జిల్లా నుంచి మండల స్థాయి అధికారులంతా దాదాపు అక్కడే ఉన్నారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడుతున్నా, దానిని అంతగా పట్టించుకోలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి గ్రామ స్థాయిలో కనీస రక్షణ చర్యలు చేపట్టాలని, పునరావాస కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

క్లుప్తంగా

పిడుగు పడి వ్యక్తి మృతి



కుటుంబ సభ్యులతో వీరాస్వామి (ఫైల్)

కాజులూరు: ఉప్పుమిల్లిలో సోమవారం పిడుగుపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కరప మండలం కూరాడకు చెందిన నందికోండ వీరస్వామి (35) కొన్నాళ్ల కిందట కుటుంబ సమేతంగా ఉప్పుమిల్లికి వచ్చి తాపి పనిచేస్తూ, పశువులను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున భారీ వర్షం కురుస్తుండటంతో పశువులను పాకలో కట్టేందుకు పొలానికి వెళ్లాడు. ఆ సమయంలో వీరస్వామి పిడుగుపాటుకు గురవ్వగా స్థానికులు గమనించి యానం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. వీరస్వామికి భార్య, నాలుగేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

ఆగి ఉన్న లారీని ఢీకొని..

అన్నవరం: తుని పట్టణం నుంచి కోడిగుడ్ల లోడుతో భువనేశ్వర్ వెళ్తున్న లారీ సోమవారం ఉదయం స్థానిక సత్యదేవుని నమూనా ఆలయం సమీపంలో ఆగి ఉన్న మరో లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కోడిగుడ్ల లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. ఆ లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తుని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వారు తణుకు బయల్దేరి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర ఖోఖో జట్టుకు కరప విద్యార్థిని ఎంపిక



యస్మిత నాగమహి

కరప: స్థానిక నక్కా సూర్య నారాయణ మూర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.యస్మిత నాగమహి(పదో తరగతి) రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎంపికైంది. బాలికల జూనియర్ విభాగంలో అండర్–17 నేషనల్ ఖోఖో పోటీలలో పాల్గొననుంది. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ఈ నెల 16, 17 తేదీలలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో బాలికల సౌత్‌జోన్ ఖేలో ఇండియా మ్యాచ్‌కి మన రాష్ట్రం తరఫున యస్మిత పాల్గొంటుందని పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. యస్మితకు తర్ఫీదునిచ్చిన పీడీలు కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, సీహెచ్ కృష్ణలను ఎమ్మెల్యే పంతం నానాజీ, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, పీఎంసీ చైర్మన్ దేవు దుర్గారావు, హెచ్‌ఎం శ్రీనివాసరావులు అభినందించారు.

ముహూర్తం కుదిరింది..

- మూడుముళ్ల బంధానికి మోగిన భాజా
- పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం
- డిసెంబర్ నెలాఖరు వరకూ శుభగడియలు
- కల్యాణ మంటపాలకు పెరిగిన డిమాండ్



పచ్చిపూలతో రూపొందించిన కల్యాణ మండపం

కొత్తపేట: మూడుముళ్ల బంధానికి ముహూర్తం కుదిరింది.. పెళ్లి గడియ రానే వచ్చింది.. వివాహాల సీజన్ మళ్లీ మొదలైంది. ఆశ్వయుజ, కార్తిక, మార్గశిర మాసాల్లో (అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు) మంచి లగ్నాలు ఉండటంతో వివాహాది శుభకార్యాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ మేరకు ఈ నెల 13 నుంచి మంచి ముహూర్తాలు ప్రారంభమై డిసెంబర్ 30 వరకూ ఉన్నట్టు వేద పండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. అలాగే ఈవెంట్ మేనేజర్లు, క్యాటరింగ్, లైటింగ్, షామియానా, అలంకరణ కార్మికులకు ముందస్తు బుకింగ్‌లు వచ్చాయి. ఇదే ముహూర్తాల్లో తమ మతాచారాల ప్రకారం చర్చిలు, మసీదుల్లో వివాహాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కల్యాణ మండపాలతో పాటు షాదీఖానాలు, చర్చిల ఆధ్వర్యంలోని మ్యారేజ్ హాళ్ల బుకింగ్‌లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మూడు నెలల్లో వేలాది వివాహాలు జరగనున్నట్టు అంచనా.

శుభ ముహూర్తాలు ఇలా..

ప్రస్తుత ఆశ్వయుజ మాసం (అక్టోబర్ 2 నుంచి నవంబర్ 1) లో నాలుగు ముహూర్తాలు ఉన్నాయి. కార్తికమాసం (నవంబర్ 2 నుంచి డిసెంబర్ 2 వరకు) 17 ముహూర్తాలు, మార్గశిర మాసం (డిసెంబర్ 2 నుంచి 30 వరకూ) 12 ముహూర్తాలు ఉన్నాయి. ఆయా తేదీల్లో వధూవరులకు, ఇతర శుభకార్యాలు నిర్వహించే వారి నక్షత్రాలను బట్టి పైముహూర్తాలు నిర్ణయించుకోవాలని పండితులు చెబుతున్నారు.

మంటపాలకు గిరాకీ

వరుస తుపాన్లు, అల్పపీడనాలు, భారీ వర్షాల కారణంగా, వాతావరణం ఎప్పుడు అనుకూలంగా ఉంటుందో, ఎప్పుడు ప్రతికూలంగా ఉంటుందో తెలియని పరిస్థితుల్లో దాదాపు అందరూ తమ స్థాయిని బట్టి చిన్న, పెద్ద కల్యాణ మండపాల్లో వివాహాలకు మొగ్గు చూపుతున్నారు. దీంతో కల్యాణ మండపాలకు డిమాండ్ బాగా పెరిగింది. అంతేకాకుండా ఇళ్ల వద్ద తగినంత స్థలాలు లేక వివాహాలకు అనుకూలంగా ఉండకపోవటంతో వ్యయ, ప్రయాసలైనా తప్పక ఫంక్షన్ హాల్స్‌ను బుక్ చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కల్యాణ మండపాలన్నీ మూడు నెలలకు ముందుగానే బుక్ అయిపోయాయని కల్యాణ మండపాల నిర్వాహకులు చెబుతున్నారు.

ఈవెంట్స్ ప్రాధాన్యం

ఇటీవల కాలంలో పెళ్లికి కళ తీసుకువచ్చే ఈవెంట్స్‌కు డిమాండ్ పెరిగింది. వాటిలో వధూవరులు ఊరేగే రథాలు, గుర్రపు బగ్గీలు, కల్యాణ మండపానికి పెండ్లి కుమార్తెను తీసుకువెళ్లే వినూత్నమైన వాహనాలు, మల్లె పందిర్లు, కల్యాణ మండపం వద్ద స్వాగత ద్వారాలు, ఆవరణలో డెకరేషన్లు, రంగుల లైటింగ్ సెట్టింగ్‌లు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. కల్యాణ మండపాలను వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన పచ్చిపూలతో అలంకరిస్తున్నారు. దీనికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. దానితో ఈవెంట్స్ నిర్వాహకులకు చేతినిండా పని, తద్వారా అనేక మందికి ఉపాధి దొరుకుతుంది.

మూడు నెలలూ అనుకూలం



ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలు శూన్య మాసం, భాద్రపద మాసం కావడంతో వివాహాది శుభ కార్యాలకు ముహూర్తాలు లేవు. దానితో వివాహాలు జరగలేదు. ప్రస్తుత ఆశ్వయుజ మాసం నుంచి మార్గశిర మాసం (డిసెంబర్) చివరి వరకూ వివాహాలకు అనుకూలమైనవి. చాలా మంచి ముహూర్తాలు ఉన్నాయి.

–పిడపర్తి రవికుమార్, పండితుడు, పలివెల, కొత్తపేట మండలం



వధూవరులకు ఉత్సవ రథం

యువకుల మృతదేహాల గుర్తింపు



గోదావరి పడి మృతి చెందిన నరాల వేదమూర్తి, మేడిశెట్టి వీరబ్రహ్మం

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి గోదావరి నదిలో దేవీ విగ్రహాల నిమజ్జనోత్సవానికి వెళ్లి గోదావరిలో నరాల వేదమూర్తి, మేడిశెట్టి వీరబ్రహ్మం గల్లంతైన విషయం విదితమే. వారి మృతదేహాలను సోమవారం పోలీసులు గుర్తించారు. ఆదివారం మధ్యాహ్నం దేవీ నిమజ్జనం అనంతరం స్నానానికి దిగిన ఆ ఇద్దరు యువకులు గోదావరి ఉధృతికి గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి స్థానిక రెవెన్యూ సిబ్బంది, పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం మేడిశెట్టి వీరబ్రహ్మం మృతదేహం, మధ్యాహ్నం వేదమూర్తి మృతదేహం లభ్యమయ్యాయి. మృతదేహాలకు స్థానిక పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం యువకుల మృతదేహాలను బంధువులు సొంత గ్రామం రావిచెరువుకు తరలించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ గ్రామంలో పర్యటించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అధికారుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి

కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు యువకుల నిండు ప్రాణాలు బలైపోయాయని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. ఆదివారం ఉదయం కోటిపల్లి గోదావరిలో జరుగుతున్న గాలింపు చర్యలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రసిద్ధి గాంచిన కోటిపల్లి గోదావరిలో ఏటా రెండు సార్లు నిమజ్జనోత్సవాలు జరుగుతాయన్నారు. ఆదివారం జరిగిన నిమజ్జనోత్సవాల వద్ద పోలీసు, రెవెన్యూ బందోబస్తు లేదన్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడం దారుణమని అన్నారు. ఆ రెండు రోజులూ బందోబస్తు ఉండి ఉంటే యువకుల ప్రాణాలు పోయేవి కావని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

34 కిలోల గంజాయి స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సూర్యఅప్పారావు

ఏలేశ్వరం: మండలంలోని సి.రాయవరం సమీపంలో సోమవారం అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న యువకుడిని అరెస్టు చేసి 34 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. చెన్నై కవి భారతి నగర్, పెసరపూడి గ్రామానికి చెందిన పుగాజ్‌హేంది అనే యువకుడు గంజాయికి బానిసయ్యాడు. గంజాయి తాగుతూ మిగిలిన 34 కిలోల సరకును బైక్‌పై రవాణా చేస్తుండగా, సి.రాయవరం గ్రామ సమీపంలోని సత్తెమ్మ గుడి వద్ద నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ బి.సూర్య అప్పారావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నిందితుడిపై గతంలో అనేక కేసులు ఉన్నాయన్నారు. గంజాయి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో ఎస్సై రామలింగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



క్షతగాత్రురాలికి సపర్యలు చేస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

గండేపల్లి: మండలంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపారు. వారి కథనం ప్రకారం.. ధవళేశ్వరం గ్రామానికి చెందిన దంపతులు కె.రాజశేఖర్, రాణీ లక్ష్మి మోటార్ సైకిల్‌పై పిఠాపురంలో పాదగయలో దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా, తాళ్లూరు శివారు దాబాల వద్దకు వచ్చేసరికి రోడ్డు దాటే ప్రయత్నంలో మరో మోటారు సైకిస్ట్ వేగంగా రావడంతో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో దంపతులిద్దరికీ గాయాలు కాగా, హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే పెట్రోలింగ్ సిబ్బంది ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి ఆయన కథనం ప్రకారం.. మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలేనికి చెందిన ఈతకోట నాగరాజు (48) కూలి పనులు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నాడు. అతను కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కాగా ఆదివారం రాత్రి ఇంటి వద్ద వ్యవసాయానికి వాడే పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే అతని భార్య సత్యవతి, కుమారుడు అవినాష్ చూసి 108 అంబులెన్స్ సాయంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిస్టరీగా బాలుడి మృతి

- ఐదంతస్తుల భవనం నుంచి పడిన వైనం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



చరణ్‌తేజ (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న చరణ్‌తేజ తల్లిదండ్రులు, బంధువులు

కాకినాడ రూరల్: కాకినాడలో విషాదం చోటు చేసుకుంది. ఆడుతూ పాడుతూ తిరగాల్సిన బాలుడు అర్ధాంతరంగా తనువు చాలించాడు. ఐదంతస్తుల భవనం నుంచి పడి ఆత్మహత్య చేసుకున్నాడా లేదా ప్రమాదవశాత్తు పడిపోయాడా అనేది మిస్టరీగా మారింది. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ నాగమల్లితోట జంక్షన్ సమీపంలోని ఎల్బీ నగర్‌కు చెందిన కుక్కల చరణ్‌తేజ (13) సోమవారం ఐదంతస్తుల భవనం నుంచి పడి మృతి చెందాడు. పుస్తకాలు కోసమని ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన చరణ్ తేజ సుమారు 11.30 గంట ప్రాంతంలో భవనం ఎక్కడం కేవలం రెండున్న నిమిషాలలోనే కింద పడిపోవడం జరిగిపోయింది. చరణ్ తేజ కుటుంబం సమీపంలోనే నివాసం ఉంటుంది. తండ్రి మల్లేశ్వరరావు ఆటో డ్రైవర్‌గా, తల్లి సత్యాదేవి గృహిణిగా ఉంటూ ఇద్దరు పిల్లలను చదివిస్తూ జీవనం సాగిస్తున్నారు. అశోక్‌నగర్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో చరణ్ తేజ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. భవనం నుంచి చరణ్ తేజ పడిపోయినట్టుగా ఆ నోట ఈ నోట చెప్పుకోవడంతో తమ్ముడు అఖి ఆలకించి తల్లికి చెప్పాడు. వెంటనే భవనం వద్దకు వచ్చి చూసే సరికి రక్తపు మడుగులో ఉండగా, వెంటనే స్థానికుల సహాయంతో కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించడంతో తీవ్ర విషాదంతో ఇంటికి తీసుకువచ్చారు. మృతుడి చిన్నాన్న వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు సర్పవరం సీఐ పెద్దిరాజు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రఘువీర్ విష్ణు, సీఐ పెద్దిరాజు, సిబ్బంది పరిశీలించారు. ఐదంతస్తుల భవనం వద్ద సీసీ ఫుటేజీ పరిశీలించారు. చరణ్ తేజ భవనంపైకి వెళ్లిన కేవలం రెండున్నర నిమిషాల్లోనే కిందకు పడిపోవడంతో కావాలనే దూకి ఉంటాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే సెల్‌ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్‌లు అలవాటు ఉందా అనే కోణంలోనూ పరిశీలన చేస్తున్నారు. ఇద్దరు బిడ్డల్ని చదివించేందుకు రెక్కల కష్టంతో ఆటోను నడుపుకొంటున్న మల్లేశ్వరరావు, అతని భార్య సత్యాదేవి దంపతులు, బంధువులు రోదనలతో తీవ్ర విషాదం అలుముకొంది. డీఎస్పీ సూచనలకు అనుగుణంగా కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఇదిలా ఉంటే అటుగా వెళ్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కారును ఆపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. పోలీసులతో మాట్లాడి విచారణ చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

కిర్లంపూడి: గడ్డి మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ టి.అప్పారావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రమణయ్యపేట గ్రామానికి చెందిన నక్కరాజు రమణ (52) అప్పుల బాధ తాళలేక ఆదివారం తన స్వగృహంలోనే గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. మృతుడి కుమారుడు నక్కరాజు వీరవెంకట దుర్గాప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పల్లె పండుగ.. ఉత్తి దండగ

- వారోత్సవాల తొలి రోజే అట్టర్‌ఫ్లాప్
- మద్యం లాటరీతో అందుబాటులోని లేని అధికారులు
- తూతూ మంత్రంగా మొదటి రోజు కార్యక్రమం




మండల పరిషత్ కార్యాలయంలో పల్లె పండుగ శిక్షణకు హాజరైన ప్రజాప్రతినిధులు (ఫైల్)

ఆలమూరు: పల్లె పండుగ అన్నారు.. ఎనలేని అభివృద్ధికి ఇదే శ్రీకారం అని చెప్పారు.. తీరా తొలి రోజే చేతులెత్తేశారు. ఎంతో చేస్తారని చూసిన ప్రజానీకానికి మొండిచేయి చూపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం లేక పల్లె పండుగ కార్యక్రమం ఉత్తి దండగగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల లాటరీకి ఇచ్చిన ప్రాధాన్యం పల్లె పండగకు ఇవ్వలేదని స్పష్టమైంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులూ సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించలేని పరిస్థితి దాపురించింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకూ ఒక పైసా కూడా విదల్చలేదు. దీంతో పాలకులు ఇప్పటి వరకూ గ్రామ స్థాయిలో ఏ అభివృద్ధి కార్యక్రమాన్నీ ప్రారంభించలేదు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులను ఒక తట్ట మట్టితోనైనా పూడ్చలేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు గ్రామీణ ప్రజాప్రతినిధులకు భారీ ఊరటనిచ్చాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎన్ఆర్ఈజీఎస్), 15వ ఆర్థిక సంఘం, సాధారణ అభివృద్ధి నిధుల కింద కేంద్ర ప్రభుత్వం గతంలో మాదిరిగానే ఈసారీ రాష్ట్రానికి భారీ నిధులను కేటాయించింది. దీంతో ఈ ఏడాది ఆగస్టు 23న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న 22 మండలాల్లోని 385 గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తూ స్థానిక ప్రజాప్రతినిధులు ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఆ గ్రామసభల్లో తీర్మానించిన పనులకు సంబంధించి తొలి విడతగా 777 పనులు చేపట్టడం ద్వారా రూ.54.52 కోట్లు ఖర్చు చేయాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,23,738 జాబ్ కార్డులు ఉండగా, అందులో 1.51 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు.

గత ప్రభుత్వంలో ఘనం

2023–24 ఆర్థిక సంవత్సరంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు 30 లక్షల పనిదినాలను కేటాయించింది. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం ఉపాధి కూలీలకు మరింతగా మేలు జరగాలనే ఉద్దేశంతో రికార్డు స్థాయిలో 43 లక్షల వరకూ కూలీలకు పనిదినాలు కల్పించి ఆ మేరకు నిధులను విడుదల చేయించింది. దీంతో జిల్లావ్యాప్తంగా ఉపాధి పనుల ద్వారా సుమారు రూ.185 కోట్లు వెచ్చించింది. అందులో కూలీల వేతనాలు రూ.112 కోట్లు కాగా మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా రూ.65 కోట్లు, పరిపాలన పరంగా రూ.ఎనిమిది కోట్లను ఖర్చు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ భవనాల నిర్మాణంతో పాటు అంతర్గత రహదారులు, ఎస్సీ, ఎస్టీ కాలనీలు అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం పల్లె పండుగ నిధులతో రోడ్ల అభివృద్ధితో పాటు మినీ గోకులాలు, పంట కాలువల ఆధునీకరణ, ప్రభుత్వ పరిపాలన భవనాలు, వాటర్ ట్యాంకుల నిర్మాణం, డ్రైనేజీలు తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ పనులను ప్రారంభించడానికి సోమవారం నిర్వహించిన గ్రామసభలు తూతూమంత్రంగా జరిగాయి. మొదట్లోనే ఇలా ఉంటే ముందుముందు పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో..



ఎన్ఆర్‌జీఈఎస్ పథకం కింద ఉపాధి పనులు వేగవంతం చేస్తున్నాం. ఇందులో భాగంగానే పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. గత ఏడాది లక్ష్యానికి మించి ఉపాధి పనులు చేపట్టిన విధంగానే ఈ ఏడాది కూడా అదే తరహాలో ముందుకు సాగుతాం.

–పి.మధుసూదన్, డ్వామా పీడీ, కోనసీమ జిల్లా